632 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం నాడు జరిగిన ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలకు 632 మంది గైర్హాజరయినట్లు ఆర్ఐఒ సురేష్‌బాబు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29,788 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 29,156 మంది హాజరయ్యారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 99 పరీక్ష కేంద్రాల్లో ఒకేషనల్‌కు సంబంధించి 2585 మందికి గాను 2493 మంది హాజరయ్యారు. 92 మంది గైర్హాజరయ్యారు. తెలుగుకు సంబంధించి 27,203 మందికి గాను 26,663 మంది హాజరయ్యారు. 540 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ లేవని అన్నారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, డిఇసి మెంబర్లు, హైపవర్ కమిటీ మెంబర్ లు, జిల్లా అబ్జర్వర్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పోలీసులు పరీక్ష కేంద్రాలు వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు. సెంటర్ల వద్ద మెడికల్ సిబ్బందిని కూడా ఉంచారు.

మళ్లీ నిరాశే..!

- సాగునీటి రంగానికి లభించని ప్రాధాన్యత
- తుంగభద్ర, హంద్రీనీవాకు కనిపించని కేటాయింపులు
- విశ్వవిద్యాలయాల పరిస్థితీ అంతే..

రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు మరోసారి నిరాశే మిగిలింది. శుక్రవారం నాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నామమాత్రపు కేటాయింపులు కూడా లేకపోవడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. ప్రధానమైన ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు మొక్కుబడిగానే సాగాయి. హంద్రీనీవా వెడల్పు, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణకు ప్రాధాన్యత ఈ బడ్జెట్‌లో లభిస్తుందని అందరూ ఆశించారు. అయితే ఆ ఆశలు పెద్దగా ఫలించలేదు. ప్రభుత్వం పాత వాటి నిర్వహణకే పరిమితమైంది. విద్య, ఇతర రంగాలకు సైతం నామమాత్రపు కేటాయింపులే జరిగాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర బడ్జెట్ తీరు యథావిధే అన్నట్టుగా ఉంది. ఎప్పటిలాగానే ఈ ఏడాది నిధుల కేటాయింపులు మొక్కుబడే అని చెప్పాలి. వ్యవసాయాధారిత జిల్లాగానున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల మెరుగు చాలా అవసరముంది. కాని రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి ప్రాజెక్టులకు పెద్దగా నిధుల కేటాయింపులు చేయలేదు. నిర్వహణకు తగ్గట్టుగానే నిధులు కేటాయించింది. జిల్లాకు ప్రధాన జలవనరుగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి చాలా అధ్వాన్నంగా మారింది. నీటి ప్రవాహ సమయంలో ఎప్పుడు ఎక్కడ గండ్లు పడుతాయోనన్న భయం ఇంజనీరింగ్ అధికారులను సైతం వేధిస్తోంది. ఆ కిందనున్న మిడ్ పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ పనులు ఆగిపోయాయి. పిఎబిఆర్ డ్యామ్ కింద భూసేకరణ చేపట్టాల్సి ఉంది. వీటన్నింటికీ సుమారు వెయ్యి కోట్లకుపైగా నిధులు అవసరమవుతాయని తుంగభద్ర అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు బడ్జెట్‌కు ప్రతిపాదనలు పంపారు. ఇందులో కనీసం రూ.250 కోట్ల వరకైనా నిధులు ఈ ఏడాది బడ్జెట్‌లో వస్తాయని అంచనా వేశారు. కాని ప్రభుత్వం గతేడాది తరహాలోనే నిధులను నామమాత్రంగానే కేటాయించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు రూ.112.96 కోట్లు కేటాయించి, రూ.111.17 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి అంటే 2023-24కుగానూ రూ.117.19 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇక జిల్లాకు మరో ప్రధాన సాగునీటి ప్రాజెక్టుగానున్న హంద్రీనీవా పరిస్థితి ఇదే రకంగా ఉంది. 2022-23 సంవత్సరంలో కేటాయింపుల కంటే అధికంగానే నిధులు మంజూరు చేసింది. ఇందులో అత్యధికం విద్యుత్ బిల్లుల చెల్లింపులే ఉండటం గమనార్హం. హంద్రీనీవాకు 2022-23 సంవత్సరంలో ర.337.97 కోట్లు కేటాయించి రూ.1255.77 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.674 కోట్లు విద్యుత్ బిల్లుల పాత బకాయిల చెల్లింపులున్నాయి. తక్కిన వాటికి అక్కడిక్కడ పనులకు మంజూరు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.270.14 కోట్లతోనే సరిపెట్టింది. హంద్రీనీవా కాలువ వెడల్పు చేస్తామని ప్రకటించి ఆరు వేల కోట్లతో టెండర్లు సైతం పిలిచారు. ఇవి పూర్తి చేయాలంటే ఈ నిధుల కేటాయింపులు ఏ మాత్రం సరిపోయే అవకాశం లేదు.

ఉన్నత విద్యకు అంతంతే...

ఉన్నత విద్యకు అంతంత మాత్రంగానే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. జిల్లాలో రెండు విశ్వవిద్యాలయా లున్నాయి. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి 2022-23 బడ్జెట్‌లో రూ.65.87 కోట్లు కేటాయించి, రూ.78.37 కోట్లు మంజూరు చేసింది. 20223-24 సంవత్సరానికిగానూ రూ.71.14 కోట్లు కేటాయించింది. అనంతపురం జెఎన్‌టియుకి 2022-23 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.53.01 కోట్లు కేటాయించి రూ.49.47 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.57.25 కోట్లు కేటాయించింది. ఇలా ప్రధానమైన వాటికి నిధులు కేటాయింపులు నామ మాత్రంగానే జరిగాయన్న విమర్శలు విపక్షాల నుంచి వ్యక్తమవుతోంది.

అప్పుల్లోనే పురోగతి

శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అప్పుల్లో పురోగతి, అభివృద్ధిలో తిరోగతి వైపు నడిపించేలా ఉంది. కేటాయింపులు జనాభాకు అనుగుణంగా చేయలేదు. అన్ని పథకాలకు నిధులు కుదించేశారు. నీటి ప్రాజెక్టుల నిర్మాణం తదితర వాటిలో ప్రాధాన్యత ఇవ్వలేదు. కర్నాటక ప్రభుత్వం అప్పర్ భద్ర నిర్మాణం చేపడుతుంటే ప్రస్తావనే చేయని పరిస్థితి. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన మూలధన పెట్టుబడి రూ. 30 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. గత ఏడాది రూ.32 వేల కోట్లు కేటాయించి రూ. 18 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలపై భరోసా ఇవ్వని పరిస్థితి ఉంది. ఉపాధి హామీ పథకం నిధులు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలకు దారి మళ్లించారు. 40 రోజులు మాత్రమే పని దినాలు కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి చర్యలు ప్రకటించని పరిస్థితి ఉంది. కొత్త పింఛన్ల పెంపుదలకు చర్యలు లేవు. జిల్లా ప్రజా ప్రతినిదులు గొంతు విప్పి జిల్లా అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు సాధించాలి.

వి.రాంభూపాల్,సిపిఎం జిల్లా కార్యదర్శి.

ఎన్నికల బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం రాబోయే ఎన్నికల దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టిన బడ్జెట్‌లా ఉంది. నవరత్నాల పేరుతో ఓట్లు వేయించు కోవడానికి చేసిన ప్రయత్నంలా ఉంది. రాయలసీమలో తాగు, సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు.వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేశారు. సంక్షేమ పథకాలు చూపుతూ ఓట్లు కొల్లగొట్టేందుకు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లా ఉంది. ఎన్నికల లాభాపేక్ష బడ్జెట్‌లా ఉంది.

సి.పెద్దన్న,సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి.

చేనేతలకు మొండిచేయి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సారి బడ్జెట్‌లో చేనేతలకు అన్యాయం చేసిందని, దానిని కొనసాగిస్తూ ఈసారి కూడా అదే పునరావృతం అయ్యింది. ఎన్నికల మునుపు చేనేతలను ఆదుకునేలా బడ్జెట్లో రూ.1000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామిని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిలబెట్టుకోలేక పోయారు. రాష్ట్రంలో చేనేతల జనాభా అధికంగా ఉన్న కేవలం నామమాత్రంగా రూ.200 కోట్లు మాత్రమే నిధులు కేటాయించడం సరికాదు. ప్రస్తుత బడ్జెట్ నేతన్ననేస్తం పథకానికే సరిపోతోంది. చేనేత పాలసీని అమలు చేయకపోవడం చూస్తుంటే, చేనేతల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రేమ ఉందో అర్థం అవుతోంది.

పోలా రామాంజినేయులు,
ఏపీచేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు.

రైతులకు అన్యాయం

బడ్జెట్‌లో రైతులకు ప్రాధాన్యత ఇవ్వకుండా నిరాశపరిచారు. గత సంవత్సరం కేఆయించిన నిధులకంటే రూ.2 వేల కోట్లు కుదించేశారు. సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణాలు చేస్తామని గొప్పలకే సరిపెట్టారు.

ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి .

మండలి ఫలితాలు ఉత్కంఠభరితం

◆ కొనసాగుతున్న ఓట్ల లెక్కింపు ◆ ఉపాధ్యాయ స్థానంలో రామచంద్రారెడ్డికి ఆధిక్యత

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా సాగుతోంది. అనంతపురం జెఎన్‌టియు కళాశాలలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం ప్రారంభమైంది. రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి సమక్షంలో బ్యాలెట్ బాక్సులను తెరిచారు. కళాశాలలో ఉపాధ్యాయ, పట్టభద్ర నియోజక వర్గాలకు విడివిడిగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరిగింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఉపాధ్యాయ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రారంభం అవగా, రాత్రి 8గం॥గంటల సమయం నుంచి పట్టభద్రుల ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. అంత వరకు కట్టలు కట్టి ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. మొదటి రోజు సాయంత్రానికి ఉపాధ్యాయ ఫలితాలు వెలువడతాయని భావించినప్పటికీ రాత్రి వరకు కొనసాగాయి. మొదట ప్రాధాన్యతలో ఎవరికీ 50 శాతం ఓట్లు దాటకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరిగింది.

ఉపాధ్యాయ స్థానంలో రామచంద్రారెడ్డికి ఆధిక్యత

ఉపాధ్యాయ నియోజకవర్గం ఓట్ల లెక్కింపులో మొదటి ప్రాధాన్యత ఓట్లను రెండు రౌండ్లలో లెక్కింపు పూర్తయింది. ఈ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన 14 టేబుళ్లలో టేబుల్‌కు ఒక రౌండుకు వెయ్యి చొప్పున లెక్కింపు జరిగింది. రెండు రౌండ్లలో పోలైన 25,879 ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ రౌండ్‌లో మొత్తం 608 ఓట్లు చెల్లని ఓట్లుగా పక్కకు తొలగించారు. తక్కిన 25271 ఓట్లను లెక్కించారు. ఇందులో వైసిపి మద్దతుదారుడిగానున్న ఎంవి.రామచంద్రారెడ్డికి 8846 ఓట్లు వచ్చాయి. ఒంటేరు శ్రీనివాసరెడ్డికి 6853 ఓట్లు రాగా, సిట్టింగ్ ఎమ్మెల్సీగానున్న పిడిఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి 4162 ఓట్లు వచ్చాయి. డాక్టర్ చామల అనిల్‌కుమార్‌రెడ్డికి 3212 ఓట్లు, జివి.నారాయణరెడ్డికి 1345, డాక్టర్ ఎస్.మాధవరావుకు 354, అనిల్ కుమార్‌రెడ్డికి 186 ఓట్లు, దాసరి రామశేషయ్యకు 187, చామల రామలక్ష్మికి 24 ఓట్లు, పొన్నతోట గంగాధర్ రెడ్డికి 13, పి.శ్రీనివాసరావుకు 16 ఓట్లు వచ్చాయి. పోలైన ఓట్లలో ఎవరికీ 50 శాతం ఓట్లు మొదటి ప్రాధాన్యతలో దాటకపోవడంతో తక్కువ వచ్చిన ఓట్ల నుంచి రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. ఇందులో ఫలితాలు ఏ రకంగా మారనున్నాయన్నది అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

పట్టభద్రుల్లోనూ పోటాపోటీ

పట్టభద్రుల నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కూడా పోటాపోటాగా కొనసాగుతోంది. 24 టేబుళ్లలో జరుగుతున్నన ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ వైసిపి, టిడిపి మధ్య పోటాపోటీగా ఓట్లు వచ్చాయి. వైసిపి మద్దతుదారుడు వెన్నపూస రవీంద్రరెడ్డికి 9664 ఓట్లు రాగా, టిడిపి అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డికి 8837 ఓట్లు, వచ్చాయి. పిడిఎఫ్ అభ్యర్థి నాగరాజుకు 1838 ఓట్లు వచ్చాయి. శుక్రవారం నాటికి పట్టభద్రులు ఫలితం ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఫలితాలపై అభ్యర్థుల్లోనూ, ఇటు ప్రజల్లోనూ ఉత్కంఠ కొనసాగుతోంది.

ఓట్లను కట్టలుగా కడుతున్న కౌంటింగ్ సిబ్బంది

పోలైన ఓట్లను ఏజెంట్లకు చూపుతున్న కౌంటింగ్ సిబ్బంది

మహిళ అనుమానాస్పద మృతి

మృతదేహంతో ప్రియుడి ఇంటిముందు బంధువుల ఆందోళన

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఓ మహిళ అనుమానాస్పద మృతి ఘటన కదిరి పట్టణంలో గురువారం నాడు దుమారం రేపింది. ఆమెతో సహజీవనం చేస్తున్న ప్రియుడే చంపి, ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు మహిళ మృతదేహంతో ప్రియుడు ఇంటి ముందు ధర్నాకు దిగారు. న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. అమడగూరు మండలానికి చెందిన రమాదేవికి పెళ్లై ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈమె భర్త ఆరు నెలల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తరువాత కొంతకాలనికి ఈమె కదిరి పట్టణం పార్థసారథి నగర్‌కు చెందిన మహేష్ అనే వ్యక్తితో వెళ్లిపోయింది. వీరిద్దరూ హైదరాబాద్‌లో సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో ద్విచక్రవాహనంలో వెళ్తూ రమాదేవి ప్రమాదానికి గురైందని మహేష్ ఆమె కుటుంబ సభ్యులకు తెలిపారు. తరువాత పరిస్థితి విషమించి ఆమె మృతి చెందినట్లు చెప్పాడు. అనంతరం ఆ యువకుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని కనిపించకుండా పారిపోయాడు. రమాదేవి మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులు గురువారం నాడు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి నుంచి కదిరికి తీసుకునిచ్చారు. ఆమెతో సహజీవనం చేస్తున్న వ్యక్తి రమాదేవిని చంపి, ప్రమాదంగా చిత్రీకరించాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కదిరి పట్టణంలోని మహేష్ ఇంటి వద్ద మృతదేహంతో ఆందోళన చేపట్టారు. అయితే అప్పటికే మహేష్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి అందరూ పారిపోయారు. తమకు న్యాయం చేయకపోతే మృతదేహాన్ని మహేష్ ఇంట్లోనే ఖననం చేస్తామని బాధితులు తెలిపారు. పోలీసులు కలుగజేసుకుని ఇప్పటికే ఈ ఘటనపై అమడగూరు పోలీసు స్టేషన్ పరిధిలో విచారణ జరుగుతోందని, దీనిపై మరింత లోతైన దర్యాప్తు చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు.

పప్పుశనగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి

పప్పుశనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కణేకల్లు

మండల కేంద్రంలోని పిఎసిఎస్ గోదాము వద్ద ఏర్పాటు చేసిన పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పప్పుశనగ రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో సిఎం జగన్ వేరుశనగకు కనీస మద్దతు ధర రూ.5,335తో పంటను కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకుని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకనుంచి రైతులు బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదని ఆందోళన చెందకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనేకల్ పిఎసిఎస్ సీఈవో హనుమంతు, ఎంపిఇఒ లాలుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మాట్లాడుతున్న చేనేత, జౌళి శాఖ ఎడి శ్రీరంగం అప్పాజీ

ఈనెల 24వ తేదీ నుంచి జీన్స్ తయారీకి సంబంధించి నైపుణ్యాన్ని పెంచే విధంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీరంగం అప్పాజీ తెలిపారు. గురువారం మండల పరిధిలోని 74 ఉడేగోళం టెక్స్‌టైల్ పార్క్‌లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా టెక్స్‌టైల్ పార్క్‌లో 55 యూనిట్లు ఉన్నప్పటికీ ప్రస్తుతం ఏడు యూనిట్లు మాత్రమే ఉపయోగంలోకి రాగా 48 యూనిట్లు ప్రారంభం కాలేదనే విషయంపై సమీక్షించారు. ఈ సందర్భంగా గ్యారెంటీ లేని బ్యాంకు రుణాలను ఇప్పించాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కోరారు. అయితే కరోనా ప్రభావంతో మార్కెట్‌లో అస్థిరత ఏర్పడిందన్నారు. ఆన్‌లైన్ వ్యాపారం కారణంగా ప్రస్తుతం జీన్స్‌కు గిరాకీ లేకుండా పోయిందన్నారు. పోటీకి తగ్గట్టుగా నైపుణ్యం కలిగిన కార్మికులు లేకపోవడంతో మార్కెట్లో జీన్స్ ప్యాంట్లకు గిరాకి తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

మహిళలు చైతన్యవంతం కావాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి

ప్రజాశక్తి-గుంతకల్లు

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు పెరిగిపోయాయని, వాటిని అడ్డుకునేందుకు మహిళలు చైతన్యవంతం కావాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సిఐటియు కాలనీలో ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐద్వా పట్టణ అధ్యక్షురాలు బి.జ్యోతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఎందుకోసం ఏర్పడింది, మహిళలు ఓటు కోసం ఎంత పోరాటం చేశారనే విషయాలను తెలియజేశారు. మహిళల సమాన హక్కుల కోసం ఐద్వా మహిళా సంఘాలు చేస్తున్న పోరాటాల్లో మహిళలు భాగస్వామ్యం కావాలన్నారు. దేశంలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని దిన కూలీలు, పేదలు ఏవిధంగా జీవిస్తారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ చట్టాలను సక్రమంగా అమలు చేయాలని, మహిళలకు భద్రత కల్పించాలని, మహిళా సాధికార చట్టాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ నాయకులు లక్ష్మీబాయి, లావణ్య, రేణుక, ఆదిలక్ష్మి, సరోజ, అమృత, ఎం.లక్ష్మి, మేరీ, ముంతాజ్, మారెక్క, జ్యోతి, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి

భూసార పరీక్షలకు సిద్ధం కావాలి

జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద 2023లో చేపట్టనున్న భూసార పరీక్షలకు ల్యాబ్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్ ఆదేశించారు. గురువారం వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఉన్న భూసార పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ల్యాబ్‌లో పరికరాలు, కెమికల్స్ పరిస్థితి, సిబ్బంది నైపుణ్యం గురించి భూసార పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రోజాపుష్పలతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా 2023-26 సంవత్సరంలో జిల్లాలో చేపట్టనున్న భూసార పరీక్షలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. ల్యాబ్‌లోని పరికరాల పనితీరును పరిశీలించాను. పరికరాలు పనిచేయని పక్షంలో వాటికి సర్వీసు చేయించాలని తెలిపారు. ఈ నెల 25వ తేదీలోపు పరికరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈనెల 30వ తేదీ నాటికి సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారులు ఉమామహేశ్వరి, శేఖర్ రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

అనంతపురం : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మల మురళి, స్వప్న చేతుల మీదుగా పుట్టినిల్లు ఆశ్రమంలో పదిమంది గర్భిణులకు గురువారం సీమంతం చేశారు. హారిక సౌజన్యంతో ఈ సీమంతం కార్యక్రమం నిర్వహించామన్నారు.

In the Court of the IIIrd Addl. Junior Civil Judge:Ananthapuramu
(Excise Court)
O.S.No.1240/2019

Between:
Andhra Pragathi Grameena Bank, rep.by its Senior Manager, Venugopal Nagar, Anantapuramu. ...Plaintiff
And
1.B.Sreedhar Reddy
2.B.Lakshminarayana Reddy ...Defendants

Notice to D1 & D2

D1: B.Sreedhar Reddy S/o B.Suryanarayana Reddy, R/o D.No.3-289, Akuthotapalli Village, Anantapuramu Rural Mandal and (Dist).
D2: B.Lakshminarayana Reddy S/o B.Suryanarayana Reddy working as A.R. Police Constable No.237, Head Quarters, Anantapuramu R/o D.No.12-3-467, Jesus Nagar, Anantapuramu.

పై దావా నందు వాది బ్యాంకుకు రావాల్సిన బాకీ మొత్తము రాబట్టుకొనుటకై ప్రతివాదులు అయిన మీ పైన దావా దాఖలు చేసియున్నారు. కావున ప్రతివాదులు అయిన మీరు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు తేది:24-03-2023 న హాజరు కావలయును లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించుదురని తెలుపడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

B.Nagalingam, M.A., B.L.,
Advocate for Plaintiff
Anantapuramu, Cell:9440759948.

In the Court of the Hon'ble Prl. Junior Civil Judge:Ananthapuramu
I.A.No.1050/2022 in O.S.No.12/2008

Between:
K.Raghavendra Reddy ...Petitioner/Plaintiff
And
S.Amida Bhanu and 5 others ...Respondent/Defendant

Notice to Respondent/Defendants No.5 and 6

R5: S.Aashiq S/o Fakruddin
R6: S.Zilan S/o Fakruddin. Both are Residing at D.No.13/2/732, CAN Apartment, Ram Chandra Nagar, Anantapuramu.

ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా ప్రతివాదులు R5 & R6 హాజరు నిమిత్తం పై కోర్టునందు 28-03-2022వ తేది పై కోర్టు నందు వాయిదా వున్నది. కావున పై తేది రోజు ఉదయం 10.30 గంటలకు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

ఎ.రామిరెడ్డి, జి.రామకిశోర్‌రెడ్డి,
అడ్వకేట్స్, అనంతపురం.

In the Court of the Addl. Senior Civil Judge:Ananthapuramu
I.P.No.64/2022

Between:
V.Manjunath ...Petitioner
V/s
P.Ramalingeswara Reddy & 9 others ...Respondents

Notice to Respondents No.R3,R4,R10

R3: B.Eswaraiah S/o Akkulappa, D.No.1-49, B.C. Colony, Pinnadari(V), Anantapur (Dist).
R4: C.Pruthvi Raj S/o C.Sheena, D.No.16/559/21, Umanagar, Anantapur City Dist.
R10: S.Abdul Kareem S/o Rahamthulla, D.No.2/3/75, Jayama Colony, Muddanur Rioad, Pulivendula Town, Kadapa Dist.

పై పిటీషనరు తనను ఇన్‌సాల్వెంట్‌గా ప్రకటించమని కోరిన పిటీషనులో ప్రతివాదులు 3,4,10 ల హాజరు నిమిత్తం పై కోర్టు వారు తేది:21-03-2022నకు వాయిదా వేయడమైనది. సదరు ప్రతివాదులు ఆక్షేపణలు ఉన్న యెడల తేది:21-03-2022 ఉ॥ 10.30 ని॥లకు పై కోర్టు ఎదుట వ్యక్తిగతముగా గానీ వకీలు ద్వారా గానీ హాజరయి ఆక్షేపణలు తెలియజేయవచ్చు. కాని పక్షమున వారి పరోక్షమున పిటీషనను తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఎస్.గోపి, అడ్వకేట్, అనంతపురం.

మహారాజ రాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు:అనంతపురం
O.S.No.92/2021

Between:
చాకలి సురేష్ ...వాది
ఎదిరి
చిన్న వెంకటేష్ మరియు 29 ఇతరులు ...ప్రతివాదులు

12వ,13వ,21వ ప్రతివాదులకి నోటీసు

D12: కె.వి.హరిక్రిష్ణ, తండ్రి కె.వి.గోవిందు, వయస్సు:27 సం॥రాలు, డోర్‌నెం.28-4-820, మధురానగర్, ఎస్.బి.ఐ. కాలనీ, అనంతపురము మండల్ & జిల్లా.
D13: దుబ్బా వెంకటశేషరెడ్డి తండ్రి లేట్ దుబ్బా వెంకటస్వామి, వయస్సు:47 సం॥రాలు, డోర్‌నెం.11-974, అరవిందనగర్, అనంతపురము మండల్ & జిల్లా.
D21: యం.రాము తండ్రి యం.సుబ్బారాయుడు, వయస్సు:45 సం॥రాలు, డోర్‌నెం.3-353-4, సోమనాథ్ నగర్, అనంతపురము మండల్ & జిల్లా.

ఇందుమూలముగా ప్రతివాదులైన మీకు తెలియజేయడ మేమనగా, పై కోర్టువారు పై కేసులో మీకు పలుమార్లు నోటీసులు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఆదేశించి పై కేసును 28-03-2023వ తేదికి మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరి తేదినాడు ఉ॥10.30 గం॥లకు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై కేసు వా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:28-03-2023.

పి.నరశింహుడు, శ్రీమతి వి.యల్.కామేశ్వరి
వాదిపరం న్యాయవాదులు, అనంతపురం.

మహారాజ రాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు:అనంతపురం
I.A.No.148/2021 in O.S.No.92/2021

Between:
చాకలి సురేష్ ...వాది
ఎదిరి
చిన్న వెంకటేష్ మరియు 29 ఇతరులు ...ప్రతివాదులు

12వ,13వ,21వ ప్రతివాదులకి నోటీసు

D12: కె.వి.హరిక్రిష్ణ, తండ్రి కె.వి.గోవిందు, వయస్సు:27 సం॥రాలు, డోర్‌నెం.28-4-820, మధురానగర్, ఎస్.బి.ఐ. కాలనీ, అనంతపురము మండల్ & జిల్లా.
D13: దుబ్బా వెంకటశేషరెడ్డి తండ్రి లేట్ దుబ్బా వెంకటస్వామి, వయస్సు:47 సం॥రాలు, డోర్‌నెం.11-974, అరవిందనగర్, అనంతపురము మండల్ & జిల్లా.
D21: యం.రాము తండ్రి యం.సుబ్బారాయుడు, వయస్సు:45 సం॥రాలు, డోర్‌నెం.3-353-4, సోమనాథ్ నగర్, అనంతపురము మండల్ & జిల్లా.

ఇందుమూలముగా ప్రతివాదులైన మీకు తెలియజేయడ మేమనగా, పై కోర్టువారు పై కేసులో మీకు పలుమార్లు నోటీసులు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఆదేశించి పై కేసును 28-03-2023వ తేదికి మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరి తేదినాడు ఉ॥10.30 గం॥లకు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై కేసు వా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:28-03-2023.

పి.నరశింహుడు, శ్రీమతి వి.యల్.కామేశ్వరి
వాదిపరం న్యాయవాదులు, అనంతపురం.

నత్తనడకన భవన నిర్మాణాలు

మధ్యలోనే ఆగిన రైతు భరోసా కేంద్రం

అర్ధాంతరంగా ఆగిన భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రజల వద్దకే పాలన అనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనం, గ్రామ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను చేపట్టింది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్య ధోరణి, అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపంతో ఆయా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆత్మకూరు మండలంలో 11 గ్రామ సచివాలయాలు, 10 రైతు భరోసా కేంద్రాలు, 10 గ్రామ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు గతేడాది నుంచి నిర్మాణ పనులు చేపట్టారు. ఆయా గ్రామ సచివాలయాలు మండల కేంద్రంలో మాత్రం 2 గ్రామ సచివాలయాలు పూర్తి అయ్యాయి. గ్రామ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు ఒక్కొక్కటి పూర్తి అయ్యాయి. పి.యాలేరు, పంపనూరు, గొర్రిదిండ్ల, వేపచెర్ల, తోపుదుర్తి, మదిగుబ్బ, సనప, తలుపూరు గ్రామాల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రతి గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. మండలంలోని ఆత్మకూరు గ్రామంలో మాత్రమే గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లో సచివాలయ భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణానికి రూ.22 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు కేవలం కొన్ని గ్రామాల్లో మాత్రమే ముందుకు సాగాయి. మిగిలిన చోట్ల మొండి గోడలకే పరిమితమయ్యాయి. ప్రతి గ్రామ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు రూ.18 లక్షలు నిధులు కేటాయించారు. అయితే పనులు ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన పంచాయతీ రాజ్ మండల ఇంజినీర్ ఎప్పుడు వస్తాడో తెలియని పరిస్థితి. రెండు సచివాలయ భవన నిర్మాణ పనులు, రైతు భరోసా కేంద్రం మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాల పనులను జరిగేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణ

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామంలో శ్మశాన స్థలం ఆక్రమణకు గురైంది. గ్రామానికి చెందిన మిద్దె నారాయణస్వామి శ్మశాన స్థలాన్ని ఆక్రమించి అందులో మృతదేహాలను పూడ్చనివ్వకుండా అడ్డుకుంటున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శ్మశాన స్థలం ఆక్రమణపై గతంలో గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో శ్మశాన స్థలాన్ని సర్వే చేయించి హద్దులు కూడా ఏర్పాటు చేశారు. గురువారం కొందరు మృతదేహాన్ని పూడ్చడానికి శ్మశానానికి వెళ్లారు. అయితే ఆక్రమణదారుడు మిద్దె నారాయణస్వామి 'ఇది నా స్థలమని..ఇందులో మృతదేహాలను పూడ్చేందుకు వీలులేదు'..అని అడ్డుకున్నాడు. చేసేదేమీ లేక వారు మృతదేహాన్ని శ్మశానానికి పక్కనున్న ప్రభుత్వ స్థలంలో ఖననం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి మిద్దె నారాయణస్వామిపై చర్యలు తీసుకుని శ్మశాన స్థలాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ది ట్రెల్లిస్ స్కూల్‌కి జాతీయ అవార్డు

అనంతపురం జిల్లాకు దక్కిన అరుదైన గౌరవం

అవార్డును అందుకుంటున్న పాఠశాల ప్రతినిధి శ్రీకాంత్

ప్రజాశక్తి-అనంతపురం

విద్యా విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అనంతపురంకు చెందిన ది ట్రెల్లిస్ స్కూల్ జాతీయ ఉత్తమ పాఠశాల అవార్డు అందుకున్నట్లు నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఛైర్మన్ నాగేశ్వరరావు, సంస్థ దక్షిణ భారతదేశ బాధ్యులు పేరూరు బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును పాఠశాల ప్రతినిధి శ్రీకాంత్ వద్దకు అందజేశారని చెప్పారు. ఉత్తమ విద్యా సంస్థల కేటగిరీలో పలు సంస్థలు పోటీ పడగా ఎక్కువ ఆదరణ పొందిన పాఠశాలగా, విలువలతో కూడిన విద్యను అందిస్తున్న విద్యా సంస్థగా ది ట్రెల్లిస్ పాఠశాల నిలిచిందన్నారు. అందువల్ల జూరి సభ్యులు అవార్డుకు ఎంపిక చేశారన్నారు. 2020లో స్థాపించిన ఈ పాఠశాల కరోనా లాంటి ఎన్నో ఒడదుడుకులను తట్టుకొని నిలబడటానికి ఆ సంస్థ వ్యవస్థాపకులు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు నిలుస్తుందని నిర్వాహకులు వెల్లడించారు.

5న కార్మిక, రైతాంగ సమస్యలపై పోరాటం

మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చలో ఢిల్లీ
సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

మాట్లాడుతున్న సిఐటియు, రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మిక, రైతాంగ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5వ తేదీ నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్ర కుమార్, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజలను విడదీసి పరిపాలిస్తోందన్నారు. అంబానీ, అదాని వంటి కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలోతొక్కేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా వంటి స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకూ మద్దతు ధరలు కల్పించాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేసి సంవత్సరానికి 200 రోజుల పనులు, రోజువారీ వేతనం రూ.600లు ఇవ్వాలన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవి పాల్గొన్నారు.

ఎఫ్‌ఎసిల పాలనలోకి అనంత కార్పొరేషన్ ?

అనంతపురం నగరపాలక సంస్థ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒకరి తర్వాత మరొకరు ప్రమాదాలకు గురికావడం.. కుటుంబ సభ్యుల అనారోగ్యం తదితర సమస్యలతో అధికారులు దీర్ఘకాలిక సెలవులపై వెళ్తుండడంతో మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎఫ్ఎసి (ఫుల్ ఎడిషన్ ఛార్జ్) కింద కీలక పదవులు భర్తీ చేయాల్సి వస్తోంది. ఇటీవల సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగమోహన్ కుటుంబ సభ్యుల అనారోగ్యం వ్యక్తిగత సమస్యలతో మూడు నెలలు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. నెల రోజులకు పైగా ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉండిపోయింది. దీంతో పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఇన్‌ఛార్జి మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సతీష్ చంద్రకు సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎఫ్ఎసిగా బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం రాత్రి ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ పబ్లిక్ హెల్త్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వివిధ మున్సిపాల్టీల నోడల్ ఆఫీసర్ గాను పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా అదనపు భారాలతో సతమతమవుతున్న సతీష్ చంద్రకు ఇన్‌ఛార్జి మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాధ్యతలు తప్పించి సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఎఫ్ఎసి బాధ్యతలు అప్పగించారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్‌కు ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎఫ్ఎసి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదిలావుండగా గురువారం ఉదయం పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో పాల్గొనటానికి వస్తున్న కమిషనర్ భాగ్యలక్ష్మి కాలుజారి మెట్లపై నుంచి కింద పడిపోయారు. దీనితో ఆమెకు ఎడమ కాలు ఫ్రాక్చర్ అయింది. కమిషనర్ భాగ్యలక్ష్మి రెండు నెలలకు పైగా బెడ్ రెస్ట్ తీసుకోవాల్సి ఉంటుందని వైద్య నిపుణులు సలహా ఇచ్చినట్లు తెలిసింది. ఆమె సెలవుపై వెళ్తే ఎఫ్ఎసి కమిషనర్‌గా మరొకరికి బాధ్యతలు అప్పగించాల్సి వస్తుంది. సాధారణంగా కమిషనర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్తే రెగ్యులర్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా ఉన్న వ్యక్తికి బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. గతంలో ఇద్దరు రెగ్యులర్ సూపరింటెండెంట్ ఇంజినీర్లు ఎఫ్ఎసి కమిషనర్లుగా బాధ్యతలు నిర్వహించారు. వారు వరుసగా వికారుద్దీన్, జక్కా శ్రీనివాసులు రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా ఉంటూ కమిషనర్లుగా సైతం విధులు నిర్వహించారు. ప్రస్తుతం రెగ్యులర్ సూపరింటెండెంట్ ఇంజినీర్ లేని కారణంగా మున్సిపల్ రీజినల్ డైరెక్టర్‌గా వ్యవహరించే అధికారికి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఎఫ్ఎసి బాధ్యతలు అప్పగించటం రివాజుగా మారింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఆర్డీ పివివిఎస్ మూర్తికి మున్సిపల్ కార్పొరేషన్ అదనపు బాధ్యతలు అప్పగిస్తారా.. అన్నది వేచి చూడాలి. గతంలో సుదీర్ఘకాలం పాటు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన మున్సిపల్ ఆర్‌డి పివివిఎస్ మూర్తి బాధ్యతలు స్వీకరించడానికి సుముఖత వ్యక్తం చేస్తారా లేదా అన్నది తెలియాల్సి ఉంది. ఆయన ఆసక్తి చూపనిపక్షంలో తాత్కాలికంగా వేరే ఎవరినైనా ఇక్కడికి బదిలీ చేస్తారా అన్నది ప్రశ్నార్థకం. కమిషనర్ భాగ్యలక్ష్మి విశ్రాంతి నిమిత్తం సెలవుపై వెళ్తే నియమితులయ్యే వారు ఎవరైనా ఎఫ్ఎసి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించటం కత్తి మీద సాములాంటిదే. అలాగే టౌన్ ప్లానింగ్‌లోని ఇద్దరు కీలక అధికారులు ఇతర ప్రాంతాల్లో రెగ్యులర్ పోస్టుల్లో కొనసాగుతూ ఆన్ డ్యూటీ పేరుతో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో కొనసాగుతూ వస్తున్నారు. కీలక పదవులన్నీ ఎఫ్ఎసిలుగా ఉండటంతో వారి పనితీరు ప్రభావం విధుల్లో కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ప్రస్తుతం కార్పొరేషన్ ఉద్యోగ వర్గాల్లో ఈ అంశాలపైనే విస్తృత చర్చ నడుస్తుండటం గమనార్హం.

పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ముందుకెళ్దాం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ముందుకెళ్దామని నగర మేయర్ మొహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. బుధవారం అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతిని పురస్కరించుకుని నగర పాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం వల్ల మనకు ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. 56 రోజులు పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలిచ్చిన మహనీయుడు ఆయన అని కొనియాడారు. వారి త్యాగం రాబోయే తరాలకు మార్గదర్శకం కావాలని, ఆ మహనీయుని ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో అభివృద్ధి వైపు ముందుకు సాగుదామని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమా మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్ఎం.మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారిని వి.సుబ్బరత్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ శివశంకర్, సిబ్బంది కావేరి, బాషా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సిటీ : అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతులు ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సేవలు, ప్రాణత్యాగం గురించి కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా చేసుకొని విధుల్లో పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఆర్.డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఎస్ఐ లు రాజశేఖర్‌రెడ్డి, రమేష్ నాయక్, పురుషోత్తం, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద సర్పంచి మీనుగ లలితమ్మ, ఎంపీపీ చందా చంద్రమ్మ, పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, వార్డు సభ్యుడు నిరంజన్ గౌడ్, ఈఒ గౌస్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కో-ఆప్షన్ సభ్యులు పామిడి సలీమ్, నాయకులు ఓబన్న, నిర్మలమ్మ, మైనారిటీ నాయకులు పామిడి జాకీర్, మద్దికెర అన్వర్, తాజుద్దీన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. చిన్న ముష్టూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ అశ్రఫ్ అలీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు.

రాయదుర్గం : పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ కిషోర్, మున్సిపల్ ఇంజినీర్ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కోటలోని నగరేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జయంతి సురేష్‌కుమార్, శ్రీరాములు, ఆఓపా అధ్యక్షులు వెంకట రమేష్, సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

గుత్తి : స్థానిక ఫుట్‌బాల్ మైదానం వద్ద ఉన్న ఏపీ రాష్ట్ర పెన్షనర్స్ భవనంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, ఆదనపు కార్యదర్శి జేన్నే కుళ్లాయిబాబు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.

చలివేంద్రం ఏర్పాటు

రాయదుర్గం : పట్టణంలోని పాత బస్టాండులో సూర్య సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మిరెడ్డి, మల్లికార్జున మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా పట్టణంలో వేసవికాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు షబ్బీర్, శేఖర్, సురేష్, శ్రీనివాసులు, మంజునాథ, నగేష్, తిప్పేస్వామి, నిస్సార్, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల కేంద్రంలోని ఫాదర్ ఫెర్రర్ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. 236 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు తెలిపారు. వీరందరూ తెలుగు, హిందీ పరీక్ష రాసినట్లు పరీక్ష నిర్వాహకులు వెంకటరమణ, ప్రభుత్వ ప్రతినిధి దామోదర్‌రెడ్డి తెలిపారు.

మెట్లు దిగుతూ జారిపడ్డ అనంత కమిషనర్

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భాగ్యలక్ష్మి కార్యాలయంలో మెట్లు దిగుతూ గురువారం కాలుజారిపడ్డారు. ఎడమ కాలు వాపు కనిపించడంతో ఆమెను నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఎక్స్ రే తీసి పాదం వద్ద ఎముకలు చిట్లినట్లు గుర్తించారు. కాలుకు బ్యాండేజ్ కట్టి చికిత్స చేశారున. మేయర్, పాలకవర్గ సభ్యులు, అధికారులు, ఉద్యోగ వర్గాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కమిషనర్‌ను పరామర్శించారు.

20 లోగా పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు పెన్షన్ పొందాలంటే ఈ నెల 20వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్లు ఖజానా శాఖ ఎస్‌టిఒలకు అందజేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్న గౌడ్, శీలా జయరామప్ప తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ జనవరి 1వ తేది నుంచి ఫిబ్రవరి 28వ తేది లోగా ప్రతి పెన్షనర్ తమ లైఫ్ సర్టిఫికేట్‌ను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో సంబంధిత ఎస్‌టిఒలకు అందజేయాల్సి ఉందన్నారు. 10,250 మంది పెన్షనర్లకు గాను 7 వేల మంది మాత్రమే లైఫ్ సర్టిఫికెట్లు అందజేశారని తెలిపారు. మిగతా 3 వేల మంది పైబడి పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. వారు తక్షణమే లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. అప్పుడే ఏప్రిల్ నెల పెన్షన్ పొందగలుగుతారని స్పష్టం చేశారు. లైఫ్ సర్టిఫికెట్‌ను ఎస్‌టిఒలకు ఈ నెల 20వ తేదీలోగా అందజేయాలని కోరారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బుక్కరాయసముద్రం : కొర్రపాడు గ్రామం వద్దనున్న డాక్టరు బిఆర్ అంబేదర్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2023-2024 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్యామలాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల 4వ తరగతి చదువుతున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి విద్యార్థులు హెచ్‌టిటిపిఎస్// ఎపిజిపిసిఇటి.ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్/ ఇంటర్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 23వ తేది ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5వ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు 9014048719, 94933 43950, 7032703759 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడిపత్రి

కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 17వ తేదీన తలపెట్టిన చలో కలెక్టరేట్ ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మున్సిపల్ కార్మికులు పాల్గొనేందుకు ముందస్తు అనుమతి కోరుతూ కమిషనర్ జబ్బార్ మియాకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు అంజి మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్స్, క్లాప్ ఆటో డ్రైవర్స్‌కు రూ.18500 వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికులకు జిపిఎఫ్ అకౌంటు కార్డులు, ప్రమోషన్స్ వంటి డిమాండ్ల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు డి.రామాంజనేయులు. పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు హొన్నూరప్ప. ఇంజినీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు పెంచల ప్రసాద్, బాలనారాయణ, కృష్ణయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాల్ : మండలంలోని వనల్లి గ్రామానికి చెందిన రైతు కాపు వన్నారెడ్డికి చెందిన రూ.80వేలు విలువజేసే పశుగ్రాసం పూర్తిగా కాలిబూడిదైంది. రైతు తెలిపిన వివరాల మేరకు.. పశువుల మేపు నిమిత్తం మొక్కజొన్న, వేరుశన, వరిగడ్డిని వామిగా ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో గురువారం మధ్యాహ్నం సంభవించిన అగ్ని ప్రమాదంలో మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు ఉరవకొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో గ్రామంలోని ఇరుగుపొరుగు రైతుల వాములు, గుడిసెలకు మంటలకు వ్యాపించకుండా చేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా కృషి చేస్తా

ప్రజాశక్తి -అనంతపురం

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా పార్టీ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్సీ మంగమ్మ పేర్కొన్నారు. పార్టీ ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. గురువారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖితతో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టిడిపి అధికారంలో ఉన్నన్ని రోజులు వాల్మీకులను పట్టించుకోలేదని విమర్శించారు. టిడిపి హయాంలో వాల్మీకులకు పదవుల్లో కూడా తగిన న్యాయం చేయలేదన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఘన నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, మాజీ ఎడిసిసి బ్యాంక్ అధ్యక్షులు పామిడి వీరాంజనేయులు, ఎర్రిస్వామిరెడ్డి, జెడ్పి ఛైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

లావిష్ ఎస్తెటిక్ హోమియో ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరంలోని సాయినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లావిస్ ఎస్తెటిక్ హోమియో ఆసుపత్రిని నగర మేయర్ మొహమ్మద్ వసీం గురువారం ప్రారంభించారు. క్లినిక్‌లో అందించే సేవల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, అనిల్ కుమార్ రెడ్డి, నాయకులు ఖాజా, డా.గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం పురపాలక సంఘం
ఆర్.ఓ.సి.నెం.1246/2020-ఏ1, తేది:14-03-2023

కళ్యాణదుర్గం పురపాలక సంఘం

వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియజేయడమేమనగా, ఈ క్రింద తెలిపిన ప్రతిఫలమిచ్చు ఆదాయ వనరులు 2023-24 సంవత్సరములో అనగా 01-04-2023 నుండి 31-03-2024 వరకు ఫీజులు వసూలు చేసుకొనుటకుగాను బహిరంగ వేలము పద్ధతి ద్వారా 21-03-2024 మంగళవారము ఉదయం 11.00 గంటలకు పురపాలక సంఘం కార్యాలయంలో పురపాలక సంఘ కమిషనర్ గారిచే లేదా వారి అధికారం పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. ఏ కారణం తెలపకనే వేలం వాయిదా వేయుటకు, రద్దుపరచుటకును కమిషనర్ గారికి పూర్తి అధికారం కలిగివుండును.

వ నెం.	గుత్త వివరములు	సవాలుకు ముందు చెల్లించవలసిన సెక్యూరిటీ ధరావత్తు	ధరావత్తు హాజరు పరచవలసిన	వ్యక్తిగత సాల్వెన్సి
1.	వారపు సంత	30,000/-	2,00,000/-	10,00,000/-
2.	బస్టాండు	30,000/-	2,00,000/-	7,50,000/-
3.	లారీ బస్టాండు	30,000/-	2,00,000/-	10,00,000/-
4.	రోడ్డు మార్జిన్	30,000/-	1,50,000/-	10,00,000/-

గమనిక:
1. పాటదారులు పురపాలక సంఘంనకు ఏ విధమైన బకాయిలు ఉండరాదు.
2. పాటదారులు తప్పని సరిగా రూ.50/-లు చెల్లించి లీజు గెజిట్ నోటిఫికేషన్ పొంది వేలములో పాల్గొనవలెను.
3. ప్రకృతి వైపరిత్యాలకు ఏర్పడ్డ నష్టములకు తప్పా ఏ ఇతర నష్టములకు పురపాలక సంఘం బాధ్యత వహించదు.
4. ఇతర వివరముల కొరకు ఆఫీసు పనిచేయు వేళలయందు సంబంధిత అధికారి వారి నుండి తెలుసుకొనవచ్చును.

సం/- కమిషనరు
కళ్యాణదుర్గం పురపాలక సంఘం.